క్లుప్తంగా

దుర్గమ్మ సేవలో స్వామీజీలు, సాధువులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను బుధవారం పలువురు స్వామిజీలు, సాధువులు దర్శించుకున్నారు. ఆనందాశ్రమం పీఠాధిపతి శ్రీ నివాసానంద సరస్వతి స్వామిజీ, పరమాత్మానంద ఆశ్రమం పీఠాధిపతి ప్రకాశానంద సరస్వతి స్వామిజీలతో పాటు పలువురు స్వామిజీలు, సాధువులు అమ్మవారి దర్శనానికి విచ్చేయగా, ఆలయ అధికారులు వారికి సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో జరుగుతున్న ఆషాఢ సారె ఉత్సవాలను స్వామిజీలు, సాధువులు వీక్షించారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయ అధికారులు స్వామిజీలకు ప్రసాదాలను అందజేశారు. సుమారు 500 మందికి పైగా సాధువులు, మాతాశ్రీలు అమ్మవారిని దర్శించుకున్నారు.

స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు నాలుగు నామినేషన్లు



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ స్థాయీ సంఘం ఎన్నికకు వైఎస్సార్ సీపీ నుంచి నలుగురు కార్పొరేటర్లు అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యం ఆధ్వర్యంలో వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్–జనరల్) డాక్టర్ డి.చంద్రశేఖర్‌కు కార్పొరేటర్లు నామినేషన్ల పత్రాలు సమర్పించారు. 55వ డివిజన్ కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణచంద్రరావు, 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రహ్మతున్నీసా, 19వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహనా నాహిద్, 21వ డివిజన్ కార్పొరేటర్ పుష్పాల కుమారి నామినేషన్లు దాఖలు చేశారు.

రైల్వేల్లో ప్రైవేటీకరణ నిలిపివేయాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రైల్వేల్లో ప్రైవేటీకరణ, రైల్వే ఆస్తుల విక్రయం తక్షణమే నిలుపుదల చేయాలని అఖిల భారత లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో అఖిల భారత లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్, డివిజనల్ కమిటీ, విజయవాడ బ్రాంచ్(ఎస్సీ డివిజన్) కమిటీ సంయుక్తంగా 'రన్నింగ్ స్టాఫ్ హక్కుల ప్రకటన సదస్సు' నిర్వహించింది. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ పథకాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లోకో రన్నింగ్ స్టాఫ్ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. రన్నింగ్ స్టాఫ్ భద్రతా నిబంధనలు పాటించేలా అనుమతించాలని, ప్రయాణికుల భద్రతను కాపాడాలన్నారు. రోజుకు పని గంటలు 10 గంటలకే పరిమితం చేయాలని, వరుసగా రెండు రాత్రులకు మించి నైట్ డ్యూటీ చేయించకూడదన్నారు. వారానికోసారి 46 గంటల విశ్రాంతి ఇవ్వాలని, రన్నింగ్ స్టాఫ్ 36 గంటలలోగా హెడ్ క్వార్టర్‌కు తీసుకురావాలని కోరారు. రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై పోరాటం విస్తృతం చేయాలన్నారు. సదస్సులో డివిజన్ సెక్రటరీ ఆర్వీ రాము, లోకో పైలెట్స్ పాల్గొన్నారు.

వార్డు సచివాలయం సెక్రటరీల బదిలీల్లో అన్యాయం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల నిర్వహించిన వార్డు సచివాలయం సెక్రటరీల బదిలీలో జీఓ నిబంధనలు పాటించకుండా బదిలీలు నిర్వహించారని, కౌన్సెలింగ్ ద్వారా న్యాయం చేయాలని వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ జేఏసీ చైర్మన్ బి.గంటయ్య కోరారు. వార్డు ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ జేఏసీ ఆధ్వర్యాన బుధవారం సీడీఎంఏ కమిషనర్ సంపత్‌కుమార్‌ను కలిసి తమకు న్యాయం చేయాలంటూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న తమను ఉపయోగం ఉండే అన్ని శాఖలలో తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రమోషన్ చానల్ విషయంలో కూడా తమకు అన్యాయం జరుగుతుందని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. ఈ విషయంపై తాను పరిశీలించి న్యాయం చేస్తానని సంపత్‌కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ యశ్వంత్, కో కన్వీనర్ శ్రీకాంత్, రాజశేఖర్, యూనియన్ నాయకులు మణికంత, మాధురి, గాయత్రి, సునయన, భువన, విద్య తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీటిలో నుంచే వాహనాల రాకపోకలు



గంగానమ్మ గుడి ముందు కంకర గుట్టలు

అక్కడ మట్టి కుప్పలు...ఇక్కడ కంకర గుట్టలు

విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్ నుంచి గుప్తా సెంటర్ వరకు నగరపాలక సంస్థ చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయిన్ నిర్మాణ పనులను వాస్తవానికి కుమ్మరిపాలెం సెంటర్ నుంచి ప్రారంభించాల్సి ఉండగా అక్కడ ఉన్న కాలువపై ఆక్రమణలు ఉన్నాయన్న సాకుతో గంగానమ్మ గుడి వద్ద నుంచి ప్రారంభించారు. ఈ క్రమంలో పనులకు ఆటంకం కలుగుతుందన్న కారణంగా కాలువకు అడ్డుకట్ట వేసి చేస్తుండటంతో రోడ్డుకు రెండు వైపులా ఉన్న కాలువలు నిండిపోయి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఆ మురుగునీటి ప్రవాహంలో నుంచే కార్లు, ఆటోలు, బస్సులు రాకపోకలు సాగిస్తుండటంతో పాదచారులు, ద్విచక్రవాహనదారుల దుస్తులపై మురుగునీరు వెదజల్లి నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే 'ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి' అని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయిన్ నిర్మాణానికి ముందు తవ్విన మట్టి కుప్పలు, బండ రాళ్లను రోడ్డుకు ఒక పక్కన పడేయటం, దానికి ఎదురుగా రోడ్‌కు అవతల వైపు పారిశుద్ధ్య పనులకు సంబంధించిన చెత్త బండ్లు, పార్కింగ్ చేసిన ఇతర వాహనాలు ఉండటంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గంగానమ్మ గుడి ముందు కంకరను రెండు గుట్టలుగా డంప్ చేయడంతో గుడిలోకి వచ్చేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

– భవానీపురం(విజయవాడపశ్చిమ)



రోడ్డుకు ఒక వైపు మట్టి కుప్పలు, మరో వైపు చెత్తబళ్లు

వైద్య విద్యార్థులకు అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు వెలంపల్లి
- వెలంపల్లిని కలిసి తమ సమస్యలు విన్నవించిన వైద్య విద్యార్థులు



వెలంపల్లి శ్రీనివాసరావుకు తమ సమస్యలను వివరిస్తున్న వైద్య విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైద్య విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తమ పార్టీ అండగా ఉంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో చదువుతున్న వైద్య విద్యార్థులు బుధవారం వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిసి తమ సమస్యలను విన్నవించారు. తాము గురువారం ధర్నాచౌక్‌లో జరిపే నిరసన కార్యక్రమానికి విచ్చేసి తమకు మద్దతు తెలపాలని కోరారు.ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య విద్యార్థులను మోసం చేస్తోందని, వైద్య విద్యార్థుల జీవితాలతో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ చెలగాటమాడుతున్నారన్నారు. వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు వెంటనే డాక్టర్ పట్టాలను ఇవ్వాలని కోరారు. గురువారం వైద్య విద్యార్థులు చేసే నిరసన కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మద్దతు తెలుపుతామని ప్రకటించారు.

నేటి నుంచి మున్సిపల్ కార్మికుల దశలవారీ ఆందోళన



సీడీఎంఏకు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కార్మిక నాయకులు

పటమట(విజయవాడతూర్పు): మున్సిపల్ ఇంజినీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 15వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రంగనాయకులు అన్నారు. తాడేపల్లిలోని కమిషనర్, డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)పి. సంపత్‌కుమార్‌ను బుధవారం కలిసి పలు సమస్యలను విన్నవించారు. మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ జూలై 3 నుంచి 14వ తేదీ వరకు దశలవారీ ఆందోళనలను చేస్తున్నామని, జూలై 15న విజయవాడలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ రంగంలో ఉన్న పార్కు, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ ఆఫీస్‌ల్లో విధులు నిర్వహిస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.21000–24,500 వరకు వేతనాలను పెంచాలని, శాశ్వత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను, రిటైర్ అయిన కార్మికులకు గ్రాట్యుటీ తక్షణం విడుదల చేయాలని కోరారు. కార్మికులు రిటైర్/మరణిస్తే వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులను పనుల్లో చేర్చుకోవాలని, స్కూల్ స్వీపర్లకు కనీస వేతనం రూ.21 వేలు అందించాలని కోరారు. దశలవారీ ఆందోళన కార్యక్రమంలో ఈ నెల 3న ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు, 5న స్థానిక కమిషనర్లకు వినతిపత్రాలు, 7న మున్సిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 11న కలెక్టరేట్ ఎదురుగా ధర్నాలు, గేట్‌మీటింగ్‌లు, 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రంగనాయకులు వివరించారు.

రక్తదాతలు ప్రాణదాతలతో సమానం

ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్



బ్లడ్ గ్రూప్ శిబిరంలో పాల్గొన్న రైల్వే ఉద్యోగులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రక్తదానంతో ఎంతో విలువైన ప్రాణాలను రక్షించవచ్చని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి సంసిద్ధంగా ఉండాలని రైల్వే హాస్పిటల్ ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్ అన్నారు. రైల్వే హాస్పిటల్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సత్యనారాయణపురంలోని ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ఈటీటీసీ)లో బ్లడ్ గ్రూప్ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏసీఎంఎస్ డాక్టర్ జైదీప్ ప్రాణాలను కాపాడటంలో రక్తదానం ఎంతో కీలకమన్నారు. రక్తదానం అనేది సరిహద్దులను దాటి నేరుగా ప్రాణాలను రక్షించే గొప్ప చర్య అని అన్నారు. ప్రతి ఒక్కరూ ముందుగా తమ బ్లడ్ గ్రూప్ తెలుసుకుని, అత్యవసర పరిస్థితిలో రక్తదానం చేయడానికి సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాభై మంది ఉద్యోగులు, శిక్షణార్థులు పాల్గొని బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేయించుకుని స్వచ్ఛంద రక్తదానంకు ముందుకు వచ్చారు. అనంతరం సీనియర్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.ప్రసన్న లక్ష్మి శిబిరంలో పాల్గొన్న ఉద్యోగులకు బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఈటీటీసీ ప్రిన్సిపాల్ ఎ.సీతారామ్, ఉద్యోగులు, ఈటీటీసీ శిక్షణార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి



పదవులు పొందిన నేతలను అభినందిస్తున్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పదవులు పొందిన నాయకులు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు సూచించారు. నియోజకవర్గంలోని క్లస్టర్–5లో వివిధ హోదాల్లో నూతనంగా నియమితులైన 49వ డివిజన్‌కు చెందిన నాయకులు బుధవారం వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా క్లస్టర్ నాయకులుగా నియమితులైన చేపూరి వినోద్‌కుమార్, జనమాల బాల, కంచర్ల నీరజ్‌లను వెలంపల్లి శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి చేపూరి శ్రీను, నాయకులు యర్రజొన్న విజయలక్ష్మి, భీమవరపు అరుణ్, విజయకృష్ణ, మేదర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

6న డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ జయంతి

విజయవాడకల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు, పద్మభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 95వ జయంతి వేడుకలను జీవీఆర్ సంగీత కళాశాలలో నిర్వహిస్తున్నట్లు సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనరసమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఆర్ ప్రభుత్వ నృత్య కళాశాల, డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ సంగీత కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 6వ తేదీ ఆదివారం సాయంత్రం సంగీత కళాశాలలో జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మంగళంపల్లి బాలమురళీకృష్ణ శిష్యుడు బీవీ మోహన కృష్ణ సంగీత కచేరి, ఆత్మీయ సత్కార కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

దుర్గమ్మ సేవలో మెట్రో బృందం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాజధాని మెట్రో అధికార బృందం బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకుంది. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి జయదీప్, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ రామకృష్ణారెడ్డి, ఇతర అధికార బృందం ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ అధికారులు వారికి సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ప్రసాదాలను అందజేశారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల లాభమే ధ్యేయంగా పనిచేస్తోందని ఆరోపించారు. ఈనెల తొమ్మిదో తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పాతబస్తీలో ముఠా కార్మికులతో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని అదానీ పరం చేసేందుకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. విద్యుత్ భారాలు తగ్గిస్తాం, ఒప్పందాలు రద్దు చేస్తామన్న కూటమి ప్రభుత్వం అదే అవినీతి ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రజల మీద భారాలేస్తూ మోసగించిందన్నారు. విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలందరూ నాలుగో తేదీన ఏపీ సీపీడీసీఎల్ కార్యాలయం ఎదురుగా జరిగే ధర్నాలో కలసి రావాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక హక్కుల కోసం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం 9న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను కూడా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయు పశ్చిమ నగర అధ్యక్షుడు జి.వెంకట్రావు, ముఠా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పశ్చిమ నగర నాయకులు ఆదిరెడ్డి, శ్రీకాంత్, పోలునాయుడు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో వరలక్ష్మి సేవలు చిరస్మరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యతోనే ఏదైనా సాధ్యమని భావించిన తవ్వా కనకదుర్గ వరలక్ష్మి బెజవాడ రాజారావు హైస్కూల్ సహ వ్యవస్థాపకురాలిగా, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ గ్రేడ్–1 తెలుగు పండిట్‌గా విద్యా రంగానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు కొనియాడారు. విద్యాధరపురం అరవింద వీధిలోని బెజవాడ రాజారావు పాఠశాల ప్రాంగణంలో బుధవారం జరిగిన కనకదుర్గ వరలక్ష్మి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. సభలో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏపీ ఎంఎస్ఎంఈ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు, ప్రభుత్వ డెంటల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కొడాలి జయ రమేష్ వరలక్ష్మి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మోతుకూరి వెంకటేశ్వరరావు, తేలప్రోలు రాజా హైస్కూల్ జాయింట్ సెక్రటరీ వీరయ్య గుప్తా, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ హెచ్‌ఎం కంచర్ల శ్రీనివాసరావు, అపుస్మా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు పెంట్యాల అనిల్, చిట్టూరి విద్యాలయం కరస్పాండెంట్ చిట్టూరి ఆనంద రామ సుధాకర్ పాల్గొన్నారు.

10న మెగా పీటీఎం-2ను విజయవంతం చేయాలి

దీఈవో సుబ్బారావు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల పదో తేదీన మెగా పీటీఎం–2 సమావేశాలను విజయవంతం చేయాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు అనుగుణంగా తక్షణమే ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమంపై చర్యలు చేపట్టాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు బుధవారం కృష్ణలంకలోని ఏపీఎస్ఆర్ఎంసీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కూర్చుని భోజనం చేశారు. సంతృప్తిని వ్యక్తం చేస్తూ మరింత మెరుగ్గా భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు.

రోడ్లపై వర్షపు నీటి నిల్వలు ఉండకుండా చర్యలు

వీఎంసీ అధికారులకు కమిషనర్ ఆదేశం



డ్రెయిన్లలో డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వర్షాకాలం నేపథ్యంలో వీఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వర్షపు నీటి నిల్వలు రోడ్డుపై ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం ప్రకాశం బ్యారేజ్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు, ఏలూరు రోడ్డులో పారిశుద్ధ్య నిర్వహణ, కృష్ణలంక, రాణిగారి తోట, ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డు, డెంటల్ కాలేజ్ రోడ్డు పరిసర ప్రాంతాలన్నీ పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా డీసిల్టింగ్ పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని, డెంటల్ కాలేజ్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను, సిల్ట్‌ను త్వరితగతిన తొలగించాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహించొద్దని, నగరాన్ని మరింత శుభ్రంగా ఉంచాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ కె.షమీ, ఇన్చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, బయాలజిస్ట్ కామేశ్వరరావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహామండపంలో ఈవో తనిఖీలు

- ముక్క చీరల స్టాక్ క్లియర్ చేయాలని ఆదేశాలు
- 5వ అంతస్తులో షాపుల కేటాయింపు



ముక్కచీరలను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై ప్రతి అడుగు అమ్మవారి భక్తులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఆవరణలోని మహామండపం ఆరు అంతస్తులను ఈవో శీనానాయక్ బుధవారం పరిశీలించారు. తొలుత మహా మండపం 5వ అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న దుకాణ సముదాయాన్ని పరిశీలించారు. దేవస్థానం నిర్దేశించిన కొలతల మేరకే షాపులు ఏర్పాటు చేసుకునేలా చూడాలని ఈఈ రాంబాబును ఆదేశించారు. ఇటీవల నిర్వహించిన బహిరంగ వేలంలో షాపులు దక్కించుకున్న వారికి వెంటనే షాపులు కేటాయింపు చేయాలని ఆదేశించారు. అనంతరం 4వ అంతస్తులోని చీరల గోడౌన్‌ను తనిఖీ చేశారు. గోడౌన్‌లో ముక్క చీరల స్టాక్ అధికంగా ఉండటంతో వెంటనే వాటిని విక్రయించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడో అంతస్తులో ఉపయోగంలో లేని గదులను వెంటనే శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అక్కడే ఉన్న క్యూలైన్లలో అమ్మవారి అన్న ప్రసాదం కోసం వేచి ఉన్న భక్తులతో మాట్లాడారు. అమ్మవారికి సారె ఇచ్చేందుకు విచ్చేసిన భక్తులకు ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకురావచ్చునని చెప్పారు. రెండో అంతస్తులో అమ్మవారి అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులతో ఈవో మాట్లాడి అన్న ప్రసాద నాణ్యత గురించి ఆరా తీశారు. ఈవో వెంట ఏఈవో చంద్రశేఖర్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో కేబీఎన్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న యాజమాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జాతీయ స్కేటింగ్ ర్యాంకింగ్ చాంపియన్ షిప్‌లో తమ కళాశాల విద్యార్థి సీహెచ్ రత్నరాజ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అనేక మెడల్స్ సాధించాడని కేబీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి తెలిపారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్కేటింగ్ ర్యాంకింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జూన్ 19 నుంచి 23 వరకు కోల్‌కతలో జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన రత్నరాజ్‌కు అభినందన కార్యక్రమం బుధవారం ఆ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ రత్నరాజ్ 3000 మీటర్ల రోడ్‌రేస్‌లో గోల్డ్ మెడల్, 1000 మీటర్ల రోడ్‌రేసులో సిల్వర్ మెడల్, 1లాప్ రోడ్ రేస్‌లో బ్రాంజ్ మెడల్ సాధించాడన్నారు. వీటితో పాటు కేరళలో జరిగిన జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్‌లోనూ ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రెసిడెంట్ చిట్టూరి నాగేంద్ర కుమార్ రత్నరాజ్‌ను ప్రశంసించారు.

ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లకు మెడల్స్ ప్రదానం



ఎన్‌సీసీ అధికారులకు మెడల్స్ అందిస్తున్న ఉన్నతాధికారులు

పటమట(విజయవాడతూర్పు): ఎన్‌సీసీ కాకినాడ గ్రూప్ ఆధ్వర్యంలో విజయవాడ ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లకు మెడల్స్ ప్రదాన కార్యక్రమం బుధవారం స్టెల్లా కళాశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ డెప్యూటీ డైరెక్టర్ ఎయిర్ కోమోదర్ నర్సింగ్ సైలాని పాల్గొని ఎన్‌సీసీలో విశిష్ట సేవలు అందించిన అధికారులకు, క్యాడెట్లకు మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాడెట్లు దేశ సేవలో భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, 4వ గరల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్, 8వ ఆంధ్రా ఎయిర్ స్క్వాడ్రన్ కమాండింగ్ ఆఫీసర్ అజిత్ సింగ్ రాటీ, 8వ ఆంధ్రా నేవీ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ ప్రదీప్, ఆడమ్ ఆఫీసర్ నాయక్, ఎన్‌సీసీ అసోసియేట్ ఆఫీసర్లు, పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీ బాబు ఇన్‌స్ట్రక్టర్లు, క్యాడెట్లు పాల్గొన్నారు.

ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు



వారాహి అమ్మవారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన అమ్మవారిని భక్తితో పూజిస్తే సకల కష్టాలు తీరుతాయన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని తాము వారాహి నవరాత్రి పూజలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం, ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

రేపు శాకంబరీ అలంకారం

వారాహి నవరాత్రుల చివరి రోజు శుక్రవారం అమ్మవారికి విశేషంగా శాకంబరీ అలంకారం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు శ్రీ లలితా సహస్రనామ పారాయణం, 9 గంటలకు సారె సమర్పణ, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాదవితరణ జరుగుతుందన్నారు. ఆషాఢ సారె కార్యక్రమంలో భక్తులు పసుపు, కుంకుమ, గాజులు, చీర, స్వీట్స్, చలిమిడి సమర్పించవచ్చునని తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.